క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేపడుతున్న ఏకలవ్య పాఠశాల భూ బాధితులు

డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములిచ్చిన తమకు ఉద్యోగాలు ఇచ్చేంతవరకు దీక్ష కొనసాగిస్తామని భూ బాధితులు స్పష్టం చేశారు. నేటికి దీక్ష చేపట్టి ఎనిమిదో రోజులు కావస్తున్నా జిల్లా అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో దీక్షలు కొనసాగిస్తామని భూ బాధితులు చెప్పారు. భూ బాధితులకు రాంచందర్, లైకొన్, రాందాస్, రంగశీల సర్పంచ్ మోహన్, రఘునాథ్ తదితరులు సంఘీభావం తెలిపారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు చొరవతో ఆధార్ కేంద్రాలు



బూదరాళ్లలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు చొరవతో బూదరాళ్ల పంచాయతీ గరిమండ, బూదరాళ్లలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.సూరిబాబు గురువారం తెలిపారు. పంచాయతీ పరిధిలో ఆధార్ సమస్యలతో ఉన్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. ఈ విషయాన్ని పాడేరు ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచడంతో స్పందించి ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్తులు ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రమేష్ నియామకంపై హర్షం



రమేష్

గూడెంకొత్తవీధి: పెదవలస గ్రామ పంచాయతీకి చెందిన ఎల్.రమేష్‌ను పాడేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు నియమించారు. రమేష్ మాట్లాడుతూ తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం పట్ల ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రమేష్‌కు పలువురు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

మందుల కిట్లు అందజేత



అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన మినీ మెడిసిన్ కిట్లు

అడ్డతీగల: చిన్నారులకు వచ్చే వివిధ రకాల అనారోగ్య సమస్యల నివారణకు మినీ మెడిసిన్ కిట్‌లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసినట్టు ఐసీడీఎస్ సీడీపీవో వై.సుధ తెలిపారు. చిన్నారుల్లో వచ్చే జ్వరం, చిన్న చిన్న గాయాలు, చర్మ వ్యాధులు, దగ్గు, జలుబు, విరోచనాలు, శానిటైజర్లు తదితర 10 రకాల మందులు ఈ మినీ కిట్‌లో ఉన్నట్టు చెప్పారు. అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 88 అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్‌లను అందజేశామన్నారు. ఆయా మందుల వాడకంపై అంగన్‌వాడీ కేంద్రాల్లోని వర్కర్లకు శిక్షణ ఇచ్చామన్నారు.

దుస్తుల పంపిణీ



అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని అనాథశ్రమంలోని చిన్నారులకు దుస్తులు, స్వెట్టర్లు తదితర సామగ్రిని, హుకుంపేట మండలంలోని సన్యాసమ్మపాలెంలో వృద్ధులకు రగ్గులను గురువారం వర్జిన్ మీడియా లిమిటెడ్ సంస్థ పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రాంబాబు, అయ్యప్పలు మాట్లాడుతూ సంస్థ ద్వారా గిరిజన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదల ను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావా లని కోరారు. సంస్థ సభ్యులు చిన్నయ్యపడాల్, సునీత, శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు

హుకుంపేట: ఉన్నత వైద్యాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా స్ప్రేయింగ్ పనులు చేపడుతున్నట్టు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ అధికారి కోడా మహేష్ చెప్పారు. దిగుడుపుట్టులో స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఎ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాలు తీరేనా?

- నాసిరకం పైపులతో ఇబ్బందులు..తరచూ మరమ్మతులు
- 15 రోజుల నుంచి నిలిచిన నీటి సరఫరా
- కోట్ల నిధులు వెచ్చించినా రక్షిత నీరు కరువే
- మూడు పంచాయతీ ప్రజల అవస్థలు



సీకరిలో నిరుపయోగంగా ఉన్న కుళాయి



అరడకోటలో నిర్మించిన తాగునీటి పథకం

పెదబయలు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. గిరిజనులకు సురక్షిత నీరు అందించేందుకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో గిరిజనులకు నీటి కష్టాలు తీరాయి. అయితే ఇటీవల గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాసిరకం పైపులను వినియోగించడంతో తరచూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. మండలంలోని సీతగుంట, సీకరి, అరడకోట పంచాయతీల్లో నీటి సమస్య తాండవిస్తోంది. మండలంలోని సీతగుంట, సీకరి, అరడకోట పంచాయతీల్లో 13 గ్రామాలకు నీరు అందించే లక్ష్యంగా 2012–13 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు ద్వారా రూ.5.30 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులతో పైలట్ ప్రాజెక్టును చేపట్టారు.ఈ పథకం ద్వారా సీతగుంట పంచాయతీలో పెదబయలు, సీతగుంట, రోగులపేట, రోగులపేట కాలనీ, కిత్తుకొండ, కిత్తుకొండ, ముసిడిపుట్టు, ఎ.లకేయిపుట్టు, డి.లకేయిపుట్టు 9 గ్రామాల్లో 800 కుళాయిలు, సీకరి పంచాయతీ పన్నెడ, బంగారుమెట్ట, పులుసుమామిడి మూడు గ్రామాల్లో 210 కుళాయిలు, అరడకోట పంచాయతీ అరడకోటలో 110 కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే నాసిరకంగా పైపులు అమర్చడం వల్ల నిత్యం నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది.

కొరవడిన పర్యవేక్షణ

పెదబయలు మండల కేంద్రంలో ఉన్న 2లక్షల 90వేల లీటర్ల సామర్థ్యం గల పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఇతర గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. అరడకోటలోని గెడ్డ నుంచి బంగారుమెట్ట గ్రామ సమీపంలో పంపుహౌస్ వద్దకు నీరు పంపింగ్ చేసి అక్కడ నుంచి శుద్ధి చేసిన నీటిని అన్ని గ్రామాల్లో నిర్మించిన ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. అయితే పైపులైన్‌లు నాసిరకంగా వినియోగించడంతో తరచూ దెబ్బతింటున్నాయని, ఫలితంగా తాగునీటి సరఫరా నిలిచిపోతుందని స్థానికులు చెబుతున్నారు. సుదూరంలోని గెడ్డలు, బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నెడ, బంగారుమెట్ట, పురుగుడిపుట్టు, ముసిడిపుట్టు పెదబయలు గ్రామాల్లో ప్రధాన పైపులైన్‌కు రంధ్రాలు ఏర్పడడంతో నీరంతా వృథాగా పోతోందని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి కష్టాలు మొదలయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలు

పంచాయతీ	గ్రామాలు	కుళాయి కనెక్షన్లు	జనాభా
సీతగుంట	9	800	2100
సీకరి	3	210	530
అరడకోట	1	110	500

సమస్య పరిష్కరించాలి

సీతగుంట, సీకరి, అరడకోట పంచాయతీల పరిధిలో 13 గ్రామాలకు రక్షిత నీరు అందించే లక్ష్యంగా మంజూరైన పథకం నిర్వహణలో జాప్యం జరుగుతంది. నీటి సరఫరాకు నాణ్యమైన పైపులు అమర్చలేదు. దీంతో తరచూ పైపులైన్ దెబ్బతింటుంది. ఫలితంగా నీటి సరఫరా నిలిచిపోతుంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – సందడి కొండబాబు, పెదబయలు మండలం

సక్రమంగా నీరందేలా చూడాలి

పలు గ్రామాలకు తాగునీరు అందించే పైలెట్ ప్రాజెక్టు నిర్వహణ కొరవడింది. దీంతో తాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదు. కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన తాగునీటి పథకం నిరపయోగంగా మారుతుంది. పైపులు దెబ్బతినడంతో లీకేజీల వల్ల నీరు వృథాగా పోతోంది. అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సక్రమంగా నీరందేలా చూడాలి. – బొండా సన్నిబాబు, ముంచంగిపుట్టు

చర్యలు చేపడతాం

పైలెట్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకుంటాం. గతంతో కాంట్రాక్ట్ నిర్వహణలో పథకం జరిగేది. ప్రస్తుతం సీతగుంట గ్రామ పంచాయతీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడం జరిగింది. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం. – రాజేష్, ఏఈఈ (ఆర్‌డబ్ల్యూఎస్), పెదబయలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను కొద్ది గంటల పాటు నిలిపివేస్తున్నట్టు ఈఈ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

55 మందికి వైద్య పరీక్షలు



దోనెలపాలెంలో వైద్యశిబిరం

రాజవొమ్మంగి: మండలంలోని దోనెలపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో 55 మంది రోగులకు వైద్య సేవలందించినట్టు 108 డీఈవో శ్రీనివాస్ తెలిపారు. బీపీ సుగర్ ఉన్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. గర్భిణులకు అవసరమైన జాగ్రత్తలు సూచించినట్టు చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నీ

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామంలో ఫిబ్రవరి 4న జరగనున్న సీతమ్మతల్లి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం నుంచి మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు రామరావు, కాంతారావు తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నీ విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9398552306,7569486723 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పగడ్బందీగా అమలుచేస్తున్నట్టు తహసీల్దార్ ఆర్.వి.ఎస్.నర్సమ్మ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను అందరు పాటించాలని, ఎటువంటి ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొయ్యూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ అమలులోకి రావడంతో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాజేంద్రపాలెంలో ఉన్న ఫ్లెక్సీలను సచివాలయ సిబ్బంది తొలగించారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్నామన్నారు. మండలంలో అన్ని చోట్ల కూడా ఈ ప్రక్రియ చేపడతామన్నారు. అన్ని పార్టీల నేతలు దీనికి సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను పాటించాలని సూచించారు.



రాజేంద్రపాలెంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది

ఎమ్మెల్యే మత్స్యలింగం దృష్టికి గ్రామ సమస్యలు

ముంచంగిపుట్టు: మండలంలోని పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం దృష్టికి తీసుకువెళ్లినట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు. అరకులోయలో ఎమ్మెల్యే మత్స్యలింగంను గురువారం నాయకులతో వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు పంచాయతీల్లో నెలకొన్న రహదారులు, తాగునీరు, పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, డ్రైనేజీలు తదితర సమస్యలపై వినతిపత్రాన్ని ఎమ్మెల్యే మత్స్యలింగంనకు అందజేశామన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరామన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. నాయకుడు రాంప్రసాద్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంనకు వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు పద్మారావు తదితరులు

జాతిపితకు ఘన నివాళి



ఎటపాకలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అడ్డతీగల: మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఏపీసీసీ కార్యదర్శి డి.సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో జాతిపిత చేసిన శాంతి పోరాటం మరువలేనిదన్నారు.

ఎటపాక: మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ అహింస మార్గంలో శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన ఘనత మహాత్ముడిదేనన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



అడ్డతీగలలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేత సత్తిబాబు తదితరులు

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ ఎస్‌బీఐ వద్ద గురువారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌బీఐ అమలుచేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, బీమా తదితర పథకాలతో పాటు సైబర్ నేరాలపై నాటికలు, జానపద గీతాలతో ప్రదర్శన ఇచ్చారు. విశాఖపట్నం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు స్థానిక మేనేజర్ కె.బాలరాజు చెప్పారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కించుమండ, పైనంపాడు, వెంగడ, కాంగుపుట్టు గ్రామాలో కళాజాత నిర్వహించారు. బృందం సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కించుమండలో ప్రదర్శిస్తున్న కళాజాత బృందం

హౌసింగ్ ఏఈకి సత్కారం



హౌసింగ్ ఏఈ సూరిబాబును సత్కరిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు

గూడెంకొత్తవీధి: మండల హౌసింగ్ ఏఈ సూరిబాబును గురువారం ఎంపీపీ బోయినకుమారి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ తదితరులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా సూరిబాబుకు ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో సూరిబాబును ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు కృష్ణవంశీ, వీరేంద్రపడాల్, వైస్ సర్పంచ్‌లు రాంబాబు, కామయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థం

కొయ్యూరు: అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో తొలిసారిగా 2009 నుంచి ఏటా ఇక్కడ వైఎస్సార్ పేరిట తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది మండల తీర్థాల్లో చివరిది. ఈ తీర్థానికి మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా తరలి వస్తారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రోత్సాహంతో, మలసాల వెంకట రమణారత్నం ఆర్థిక సాయంతో ఎప్పటిలాగే భారీ స్థాయిలో నిర్వహించనున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఉత్సవ ఆర్గనైజర్, మాజీ సర్పంచ్ మలసాల అనూరాధ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. కోలాటాలు, మహిళలకు ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఆహ్వానపు గుర్రాల పరుగు పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమ బహుమతులు వరుసగా రూ. 9 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు వంతున అందజేస్తామన్నారు. మధ్యాహ్నం ఆనందపురానికి చెందిన శ్రీదేవి బృందం బుర్రకథ, రాత్రి 8 గంటలకు టీవీ కళాకారులతో డాన్స్ షో ఏర్పాటు చేశామన్నారు.

విషయ పరిజ్ఞానం అవసరం



ఏయూను సందర్శించిన పాడేరు డిగ్రీ కళాశాల విద్యార్థులు

పాడేరు రూరల్: విద్యార్థులకు విషయ పరిజ్ఞానం అవసరమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రసూల్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా తమ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ తదితర గ్రూపులకు సంబంధించిన విద్యార్థులను విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ సందర్శనార్థం తీసుకెళ్లినట్టు చెప్పారు. యూనివర్సిటీలో వివిధ విభాగాలను చూపించి, పనితీరును వివరించామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు విషయ పరిజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. అధ్యాపకులు దామోదర్, జానకిరామ్, సౌజన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



కితలంగిలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



రాజవొమ్మంగిలో పశువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీలోని పలు గ్రామాల్లో పశు వైద్యాధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందును అందజేసినట్టు చెప్పారు. పశువ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్పంచ్ సుబ్బారావు, సిబ్బంది ఎస్.సుబ్బారావు, దివ్య, మనోజ్, అప్పారావు, అనంతరావు, రమేష్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. పాడిరైతులకు మందులను పంపిణీ చేశారు. పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లక్ష్మణరావు, వెంకటేష్, సుబ్బరాజు, చిన్నయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

అరకు మాజీ ఎమ్మెల్యే పాల్గుణకు ఘన స్వాగతం

పాడేరు : అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి చేరుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దంపతులకు గురువారం పాడేరులో అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి సుమారు 40 కార్లలో భారీ ర్యాలీతో పాడేరులోని తన నివాసానికి చేరుకున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులతో పాల్గుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది నెలల కాలంలో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. 1/70 చట్టానికి తూట్లు పొడిచే విధంగా మాట్లాడిన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందర్‌రావు, పోతంగి, గుంటసీమ, కురిడి సర్పంచ్‌లు వెంకటరావు, గుమ్మ నాగేశ్వరరావు, లచ్చు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, మాజీ ఎంపీటీసీలు సభ్యులు మహాదేవ్, మొద్దు, సద్దు, నాయకులు సింహాచలం, కృష్ణారావు తదితరులున్నారు.



అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దంపతులకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కూనవరం: రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను రాజకీయ వేధింపులతో తొలగించే ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుల్లపు వెంకట్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు సక్రమంగా చెల్లించకుండా కార్మికులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. పారిశుధ్య కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారికి న్యాయం చేయాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు శ్రీనివాసరావు, రజిని, శ్రీదేవి, సీత, శారద, కిరణ కుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు వెంకట్